క్లుప్తంగా

నియామకం



సమ్మరాజు

కాళేశ్వరం: ఎమ్మార్పీస్ ఎంఎస్పీ లక్ష డప్పులు వెయ్యి గొంతుకల మండల కమిటీ అధ్యక్షులుగా ఇరుగురాల సమ్మరాజు మాదిగను జిల్లా కళానాయకుల మండల అధ్యక్షుడు బోనపాకల కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా శుక్రవారం ప్రకటించారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో లక్ష డప్పులు కళానాయకుల సమావేశం సమ్మరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా అటకాపురం రాజేష్, కార్యదర్శిగా మంచినీళ్ల మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవ రి 7న హైదరాబాదులో నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమంలో మాదిగ కు లాల నాయకులందరూ పాల్గొని సభను విజ యవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

చిట్యాల: బడి బయట ఉన్న విద్యార్థులు బడికి వెళ్లి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని నైన్‌పాక కాంప్లెక్స్ సీఆర్పీ బొనగిరి తిరుపతి అన్నారు. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న బడి బయట సర్వేను మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సర్వేలో గ్రామంలో బడికి పోని విద్యార్థులను గుర్తించి బడికి పంపించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: షెడ్యూల్డ్ కులముల జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యత్వం కోసం షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22 వరకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

ఉచిత శిక్షణ

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రం (బీసీ స్టడీ సర్కిల్) ఆధ్వర్యంలో బ్యాంకింగ్ పరీక్ష కోసం 100 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారిని శైలజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వెనుక బడిన తరగతుల అభ్యర్థులు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని వివరాలకు 0870-2571192, 040-24071178 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సభకు తరలిరావాలి

టేకుమట్ల: భూపాలపల్లి పట్టణంలో నేడు(శనివారం) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ సన్నాహక సభకు మండలం నుంచి దళితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల అధ్యక్షుడు రేనుకుంట్ల శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుకలు మహా సభకు సంబంధించిన కార్యాచరణపై నేడు భూపాలపల్లిలో జరిగే సన్నాహక సభలో చర్చించనున్నట్లు తెలిపారు.

ఒకరికి తీవ్రగాయాలు

రేగొండ: ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరిగా తీవ్రగాయలైన ఘటన మండలంలోని నారాయణపురం, కొత్తపల్లి (బి) గ్రామాల మధ్యలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం వంగపహడ్ గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ భూపాలపల్లి వైపు వెళ్తుండగా మండలంలోని నారాయణపురం, కొత్తపల్లి (బి) గ్రామాల మధ్యలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రఫీకి తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రున్ని 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై సందీప్ కుమార్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఏటూరునాగారంలో పలువురికి..

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి–తాడ్వాయి మధ్యలోని 163 జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం కారు, ట్రాక్టర్ ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారావుపేట మండలం జల్లిగ్రామం నుంచి పలువురు కారులో మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో చిన్నబోయినపల్లి సమీపంలోని చింతలమోరి సమీపంలో కన్నాయిగూడెం మండలం చిట్యాల నుంచి మడప రాంబాబు ట్రాక్టర్ డ్రైవింగ్ చేసుకుంటూ మేడారం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు సడన్‌గా బ్రేకులు పడి కారుకు ఒకేసారి అడ్డం తిరిగింది. దీంతో వేగంగా వస్తున్న కారు ట్రాక్టర్ మధ్య భాగాన్ని ఢీకొట్టింది. కారు, ట్రాక్టర్ రెండు వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఆశాబీకి రెండు కాళ్లు విరిగిపోగా, మహబూబ్‌పాషాకు కంటి ఎముక, కాలు విరిగింది. నాగులమీర తలకు గాయం అయింది. అలాగే మరో వ్యక్తి యాకూబీ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ట్రాక్టర్ డైవర్ రాంబాబు తలకు గాయమైంది. పోలీసులు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో సామాజిక ఆస్పత్రికి తరలించారు.

పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్

- కరెంట్ లేక రైతుల ఇబ్బందులు
- బాగు చేయాలని అధికారులకు విన్నపాలు



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

పలిమెల: మండలంలోని లెంకలగడ్డలో వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ వారం రోజుల కింద కాలిపోయింది. దీంతో రైతులు చేనులకు నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో ఎకరానికి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద దాదాపు 15 ఎకరాలకు పైగా మిర్చి రైతులు మిర్చి సాగు చేసుకుంటున్నారు. మరికొద్ది రోజులు ఇలాంటి పరిస్థితే ఉంటే పూత కూడా రాలిపోయి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సత్వరమే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పుష్కరాలపై వైద్యాధికారి సమీక్ష



మాట్లాడుతున్న వైద్యాధికారి మధుసూదన్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెడికల్ క్యాంప్స్, సిబ్బంది, కావలసిన సామగ్రి, మందులు చేయవలసిన ఏర్పాట్లు వసతులపై జిల్లా వైద్యాధికారి మధుసూదన్ కాళేశ్వరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరిలో కుంబాభిషేకం, రాబోయే మహా శివరాత్రి తదితర కార్యక్రమాల ఏర్పాట్ల గురించి ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, మదర్–చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్, ఎపిడోమాల జిస్ట్ భాషా నాయక్, డాక్టర్ సుస్మితలకు, సిబ్బందికి రివ్యూ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

20న అప్రెంటిస్‌షిప్ మేళా

భూపాలపల్లి అర్బన్: ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాలలో భాగంగా ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించే మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 86851 00563 ఫోన్ నంబర్ సంప్రదించాలని సూచించారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

- ఎస్సై మహేందర్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్సై మహేందర్‌కుమార్

కాటారం: సమాజానికి హాని తలపెట్టే అసాంఘిక శక్తులకు ప్రజలు సహకరించొద్దని మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ సూచించారు. మహాముత్తారం మండలం సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని దండెపల్లి గుత్తికోయలగూడెంలో శుక్రవారం పోలీసులు కార్డన్‌సర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. మావోలు అభివృద్ధికి అడ్డంకులని వారి కాలం చెల్లిన సిద్ధాంతాలను నమ్మవద్దన్నారు. మావోల వల్ల కీడు తప్ప లబ్ధిలేదని వారి కదలికల గూర్చి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

- ఎస్సై సుధాకర్



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని టేకుమట్ల–రాఘవరెడ్డిపేట ప్రధాన రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి మద్యం తాగిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతారని, ప్రమాదాలతో ఆర్థికంగా శారీరకంగా నష్టపోతారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుళ్లు నాగరాజు, సుమన్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్ తండా, పాసిగడ్డతండా గ్రామాల్లో ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ ఎస్సై రబ్బాని, చిట్యాల ఎస్సై శ్రావణ్‌కుమార్ శుక్రవారం దాడులు నిర్వహించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. 10 లీటర్ల నాటు సారాయి, 35 కేజీల చక్కర, 4 కేజీల పటిక స్వాధీనం చేసుకుని 18 వందల లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. మండలంలో ఎక్కడైనా గుడుంబా అమ్మినా, తయారు చేసిన చట్ట పరమైన చర్యలు తప్పవని వారు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో ఎక్సైజ్ శాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్(టీవీఏసీ) జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 24 వరకు జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు టీవీఏసీ జేఏసీ చైర్మన్ తిప్పారపు రాజు, కన్వీనర్ మోత్కూరి కోటి శుక్రవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్చూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మోత్కూరి కోటి మాట్లాడుతూ.. దీక్షకు అధికారులు సహకరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కోసరి భాస్కర్, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, ధనలక్ష్మి, మానస, రామారావు, పైడయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

వాజేడు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. నాలుగో విడత రుణమాఫీ డబ్బులు రైతులు ఖాతాల్లో జమ కావడంతో మండల కేంద్రంలోని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేసిందని మరో నాలుగు పథకాలను జనవరి 26 నుంచి అమలు చేస్తుందన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదలచేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్ నాయక్

గోవిందరావుపేట: వెనకబడిన వర్గాల మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ. 40 వేల కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాం పూర్ణచందర్, మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, రేండ్ల శ్రీను, బొల్లం ప్రసాద్, సత్తు భద్రయ్య, కనుకుంట్ల జ్యోతి ఉన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



కోర్కిశాలలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



రేగొండ: సర్వేను పరిశీలిస్తున్న సునీల్ కుమార్



కాటారం: సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

- జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు తలపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేలో వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. కాటారం మండలం కొత్తపల్లిలో కొనసాగుతున్న సర్వేను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న తీరు, సర్వే అధికారులు నమోదు చేస్తున్న వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సర్వే పారదర్శకంగా కొనసాగేలా నిత్యం పర్యవేక్షించడం కోసం ప్రతీ మండలానికి ప్రత్యేకాధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నాలుగు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో నమోదు చేసిన వివరాల ఆధారంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పథకాల అమలుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎంపీడీఓ బాబు, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీఓ వీరస్వామి, దివ్యజ్యోతి, జ్యోత్స్న ఉన్నారు.

సర్వేను పరిశీలించిన డీఆర్‌డీఓ..

ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కోసం కాటారం మండలం కొత్తపల్లి, ధన్వాడ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ నరేశ్ పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న తీరు, సర్వే సిబ్బంది సేకరిస్తున్న వివరాలపై ఆరా తీశారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలని జాబితాలోని ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి ఉన్నారు.

పారదర్శకత పాటించాలి

మొగుళ్లపల్లి: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు ముల్కలపల్లి, కొర్కిశాల గ్రామాల్లో జరుగుతున్న సర్వే విధానాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధం చేసిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీ భరోసా, నూతన ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఎలాంటి లోటుపాట్లుకు తావులేకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దారు శ్రీనివాస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. భూపాలపల్లి మండలం గోర్లవీడులో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు మండలంలో సర్వే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుందన్నారు.

రేగొండ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలుకు అధికారులు పకడ్బందీ సర్వే చేయాలని మండల ప్రత్యేక అధికారి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొనగల్లు, భాగిర్థిపేట, దుంపిల్లపల్లిలో జరుగుతున్న రైతు భరోసా సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసాకు సాగులో ఉన్న భూముల వివరాలు నమోదుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొంటారని తెలిపారు. సర్వేకు ప్రజలందరు సహకరించాలని ఆయన కోరారు. తహసీల్దార్ శ్వేత, ఏఓ వాసుదేవారెడ్డి, ఏఈఓ గోవర్ధన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు సంగి రవి తండ్రి రత్నం గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగి రవిగౌడ్ పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బందెల నరేష్, ఆకునూరి తిరుపతి, గువ్వాడి లక్ష్మన్, పొన్నం చంద్రయ్య, బిల్లకంటి ఉమేందర్‌రావు, ఉద్దమారి మహేష్‌యాదవ్, లింగారెడ్డి, ఆది రఘు, తదితరులు ఉన్నారు.

సంఘమిత్ర ట్రస్టు ఆధ్వర్యంలో..



పరామర్శిస్తున్న ట్రస్ట్ సభ్యులు

భూపాలపల్లి అర్బన్: మండలంలోని కొత్తపల్లి(ఎస్ఎం) గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సంఘమిత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ గుర్రపు రవీందర్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, అధ్యాపకులు ఆనంద్, నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆదివాసీలపై ప్రభుత్వాల చిన్నచూపు

- టీఏజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

కాటారం: ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తూ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి పోలం రాజేందర్ ఆరోపించారు. కాటారం మండలం మద్దులపల్లిలో జిల్లా కమిటీ సభ్యుడు మద్దు కూరి శ్రీను అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పోలం రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఆదివాసీల రిజర్వేషన్ తొలిగించడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల పాలనలో ఆదివాసీ హక్కులను, చట్టాలను కాలరాస్తూవస్తుందన్నారు. ఆదివాసీ చట్టాల అమలుతో పాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివసీ సంఘం నాయకులు శ్రీను, రాంబాబు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సతీశ్



మాట్లాడుతున్న సతీశ్

రేగొండ: అర్హులైన ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు మాటూరి సతీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోటంచ గ్రామంలో డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ నితిన్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు అర్హులకు చేరే విధంగా సర్వే పారదర్శకంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పెండెల రాజు, అఖిల్, పాణి, శివ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత



సామగ్రిని తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

కాటారం: మండలంలోని రేగుల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని నిర్మాణదారులకు పంచాయతీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు ఆగకపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది పనులను అడ్డుకోని నిర్మాణ సామగ్రిని స్వాధీనపర్చుకున్నారు. సామగ్రిని పంచాయతీ కార్యాలయానికి తరలించినట్లు ఎంపీఓ వీరస్వామి తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.